# మమకారం

-పులాపు బాలకేశవులు

శ్యామల భర్తకు కాఫీ అందిస్తూ... "ఏమండీ. వచ్చే ఆదివారం మన కళ్యాణి పుట్టిన రోజు. మనం ఈ వూరు కొత్తగా వచ్చాం. కనుక ఈసారి పుట్టిన రోజు పండుగ కాస్త ఘనంగా చెయ్యాలను కుంటున్నాను, వూళ్లో నలుగురి తోను పరిచయం ఏర్పడు తుందని. ఏమంటారు?" అంది అతని ముఖంలోకి చూస్తూ.

శేఖర్ కప్పు అందుకుని "అలాగే చెయ్యి" అన్నాడు "కళ్యాణితో పాటు కల్పనా, కరుణకు కూడా బట్టలు కొనాలండి మీరు సాయంత్రం త్వరగా వస్తే బజారు వెల్దాం" అంది శ్యామల

"నాకు ఈ రోజు బ్యాంకులో పని చాలా వుంటుంది నేను రాలేను గానీ చంద్రం భార్య నిర్మలను తీసుకుని నువ్వే బజారుకు వెళ్లిరా" అన్నాడు శేఖర్.

శ్యామల త్వరగా వంట చేసి భర్తకు భోజనం పెట్టింది. అతను ఆఫీసుకు వెళ్లాక తనూ భోజనం చేసి తయారయి కళ్యాణిని భుజాన వేసుకుని నిర్మల ఇంటికి వెళ్లింది చంద్రం శేఖర్‌కు బాల్య స్నేహితుడు. తెలుగు లెక్చరర్‌గా ఆ వూళ్లోనే ఉద్యోగం చేస్తున్నాడు. వెళ్లేసరికి నిర్మల భోజనం చేస్తోంది శ్యామలను చూస్తూనే సాదరంతో ఆహ్వానించి కబుర్లు చెప్తూనే భోజనం ముగించింది శ్యామల చెప్పింది బజారు కెళ్లి బట్టలు తీసుకు రావాలని. నిర్మల సరేనని తనూ త్వరగా తయారయి తన ఫ్రెండ్ ఒకామె బట్టల షాపులోనే ఉద్యోగం చేస్తోందని, ఆ షాపులో కేవెళ్దామని చెప్పి శ్యామలనుతీసుకెళ్లింది.

వెళ్లేసరికి నిర్మల స్నేహితురాలయిన సరోజ చాలా బిజీగా వుంది. నిర్మలను చూస్తూనే చిరునవ్వుతో పల్కరించి "పిల్లలు బాగున్నారా? అన్నయ్య రాలేదేమీ"అని అడిగింది నిర్మల బట్టల అవసరం మాకు కాదు ఈవిడ మీ అన్నయ్య స్నేహితున్ భార్య... అని శ్యామలను పరిచయం చేసి వీళ్ల పాప పుట్టిన రోజుకు బట్టల కొరకు వచ్చామని చెప్పింది

సరోజ "ఈ బేరం అయ్యాక మీకు నిదానంగా చూపిస్తాను. అలా కూర్చోండి" అంది ఇరువురూ ఓ పక్కన కూర్చున్నారు నిర్మల చెప్పింది శ్యామలకు "సరోజ ఇంతకు ముందు మా బజారులోనే వుండేదని, ఇంటి వాళ్ల అబ్బాయి పెళ్లయినందున ఇల్లుగల వాళ్లు ఖాళీ చెయ్యమనడంతో ఇల్లు ఖాళీ చేసి వేరే చోట వుంటోందని, మనిషి చాలా మంచిదని, ఓ కొడుకు పుట్టాక భర్త వదిలేశాడని, అందుకే ఈ షాపులో ఉద్యోగం చేస్తోందనీ చెప్పింది.

సరోజ బట్టలు చూపించడం అయిపోగానే బిల్లు ఇచ్చి డబ్బు తీసుకుని ఓనరుకిచ్చి గుట్టగా పడివున్న చీరలన్నీ చకచక మడతలు పెట్టి సర్దేసింది. నిర్మలను, శ్యామలను రమ్మని పిలిచి ఏం కావాలో చెప్పండి చూపిస్తాను అంది

శ్యామల ముగ్గురు పిల్లలకీ గౌను గుడ్డలు కొన్నది. ఆఖర్న ఓ బుష్ షర్టు, నిక్కరుకు పీసులు తీసుకుంది.

"ముగ్గురూ పాపలేనా? బాబులు లేరా?" అంది సరోజ. "లేరు అందుకే మోజు తీరక ఈ చిన్నదానికి ఈ షర్టు, నిక్కరు కొన్నాను" అంది శ్యామల

"మీలాంటి వున్న వాళ్లకు అమ్మాయిలే వుండాలి బాధ్యతగా పెంచి కట్నాలిచ్చి పెళ్లిళ్లు చెయ్యగలుగుతారు" అంది సరోజ నవ్వుతూ. అలాగని ఒక్కళ్ళు కూడా లేకుండానా? మూడో సారి తప్పక బాబు పుడతాడేమోనని ఎంతో ఆశతో ఎదురు చూశాను. నాకు కాన్పు కష్టమైనందున మూడు సార్లు ఆపరేషన్ చేసి తీశారు. మరో అవకాశం లేనందున ఆపరేషన్ చేయించుకున్నాను" అంది శ్యామల.

"ఆడపిల్లయితే ఏమండీ అందంగా రత్నంలాగుంటేను" అని పాప బుగ్గ మీద చిటికవేసి ముద్దు పెట్టుకుంది సరోజ "రేపాదివారం పాప పుట్టినరోజు. సెలవే కనుక మీరు తప్పకుండా రండి" అని ఆహ్వానించింది శ్యామల. నిర్మల కూడ మరీ మరీ చెప్పటంతో సరేనంది సరోజ. బట్టలు తీసుకొని ఇంటికొచ్చారు.

* * * * * *

శ్యామల ఆదివారం మధ్యాహ్నం నిర్మలను తీసుకుని తను పిలవ దల్చుకున్న వాళ్లను బొట్టు పెట్టి పిలిచి వచ్చింది అందులో సరోజ కూడా వుంది శేఖర్ తన బ్యాంక్ స్టాఫ్‌ను పిలిచాడు. నాలుగయ్యే సరికి ఒక్కొక్కళ్ళు రావడం మొదలు పెట్టారు. ఆఖర్న చంద్రం, నిర్మల. సరోజ పిల్లల్ని తీసుకొని హడావిడిగా పలకరిస్తూ వచ్చిన శేఖర్ నిర్మల వెనకబడిన సరోజను చూసి గతుక్కుమన్నాడు

సరోజ. సరోజ. ఏనాటి సరోజ ఏనాటి స్నేహం? అనుకోకుండా ఇప్పుడు ఇక్కడ ఇలా కనపడటం ఏమిటి? ఆశ్చర్యంగా వుందే అని అతననుకుంటు న్నంతలోనే శ్యామల రండి రండంటూ వాళ్లిద్దర్నీ లోపలికి తీసుకెళ్ళింది.

చంద్రంతో మాట్లాడుతూనే అనుకోకుండా అతని చూపు సరోజ వెంటవున్న పిల్లవాడి మీద పడింది. అతని మస్తిష్కంలో ఏదో మెదిలింది. పదేళ్ళ బాబు తన ప్రతిరూపంగా కనపడుతున్నాడు. మనసు పాదరసంలా పరుగెడుతోంది ఆలోచనల్లోకి. కాని అది సరైన సమయం కాదని బలవంతాన మనసును అదుపులో పెట్టుకుని వచ్చిన వాళ్ళతో నవ్వుతూ మాట్లాడ సాగాడు.


నిర్మలతో సరదాగా కబుర్లు చెప్తూ వచ్చిన సరోజ ఎదురుగా "రండి రండంటూ ఆహ్వానిస్తున్న శేఖర్ను చూసి నిర్ఘాంత పోయింది. ఇన్నాళ్ళు తను మనసులో మరచి పోవాలని విశ్వ ప్రయత్నం చేసి మరువలేక అనుక్షణం అతన్నే తల్చుకుని మానని గాయంతో బాధ పడుతూ ఎవరికోసమైతే ఎదురు చూస్తూ కాలం గడుపుతోందో ఆ మనిషి అనుకోకుండా అలా ఎదురు నిలిచే సరికి అంతులేని ఆశ్చర్యంతో పాటు రవ్వంత సంతోషం కూడా కలిగింది. కాని ఆ సంతోషం ఎంతోసేపు నిలువలేదు. అతని భార్య శ్యామలను, ముత్యాల్లా అందంగా వున్న ముగ్గురి బిడ్డల్నీ ఆనంద మయమైన అతని సంసారాన్ని చూశాక శేఖర్ తనను కాదన్నా అతని సంసార జీవితం సాఫీగా సాగిపోతున్నందుకు సంతృప్తి చెందింది.

పుట్టిన రోజు వేడుకబాగానే జరిగింది. కాఫీ, ఫలహారాలు తీసుకుని ఒక్కొక్కరు వెళ్ళి పోతున్నారు. సరోజ వెళ్దామని నిర్మలతో అనగానే శ్యామల "మీ కోసం భోజన ఏర్పాట్లు చేశాను. భోజనం చెయ్యందే మీరు వెళ్ళటానికి వీల్లేదని పట్టుపట్టి బలవంతం చేసింది. సరోజకు మనసంతా అల్ల కల్లోల మయి పోయింది. మనసు గతంలోకి పరుగులు పెడుతుంటే ఇక అక్కడ ఒక్క క్షణం కూడ వుండలేక పోయింది. శ్యామల ఎంతగా బలవంతం చేసినా నాకు విపరీతమైన తలనొప్పిగా వుంది. పోయి కాసేపు పడుకుంటాను. మరోసారెప్పుడయినా తప్పక వస్తానని చెప్పి వెళ్ళి పోయింది.

"రవిని నేను పంపిస్తానులే" అని నిర్మల వుంచుకుంది. చంద్రంతో మాట్లాడుతున్న శేఖర్ పిల్లలతో ఆడుకుంటున్న రవినే చూస్తున్నాడు. "అన్నయ్యా, అన్నయ్యా" అంటూ తన పిల్లలు ముగ్గురూ రవికి కబుర్లు చెప్తున్నారు. ఆ నలుగుర్నీ చూస్తుంటే అతని మనసు ఆనందంతో నిండిపోయింది. చంద్రం నిర్మల భోజనాలు చేసి పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోయారు.

ఆ రాత్రి పడుకున్నాక శ్యామల ఫంక్షన్ కొచ్చిన వాళ్ళ గురించి ఏవేవో కబుర్లు చెప్తోంది కాని శేఖర్ వినే పరిస్థితిలో లేడు. తల నొప్పిగా వుంది అని మౌనంగా పడుకున్నాడు. అతడి మనసు జ్ఞాపకాల





తెరల్లోకి పరుగు తీసింది.

* * * * * * * 

గుంటూరులో సరోజ, శేఖర్ ఒకే కాలేజీలో చదువుకునేవారు. ఇరువురూ గాఢంగా ప్రేమించుకుని పెళ్ళి కూడ చేసుకోవా లనుకున్నారు. ఆ ధైర్యంతో నే ఒకానొక సందర్భంలో ఇరువురూ ఆనందపు టంచుల్ని చవిచూశారు. తరవాత నెల రోజులకే పరీక్ష లయిపోయి కాలేజీకి సెలవు లిచ్చారు. ఇరువురూ పార్కులో కలుసుకుని భావి జీవితాన్ని గురించే ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. శేఖర్ తను ఇంటికి వెళ్ళగానే తండ్రికి చెప్పి ఒప్పించి మీ అన్నగారితో మాట్లాడే ఏర్పాటు చేస్తానని సరోజకు మరీ మరీ చెప్పి ట్రైన్ ఎక్కాడు శేఖర్.

సరోజకు తల్లీ తండ్రీ చిన్నతనంలో నే పోయారు. తోడబుట్టిన అన్న చదువు చెప్పించి పెళ్ళి చెయ్యొచ్చులే అని భార్యకు ఇష్టం లేకపోయినా కాలేజీలో చేర్పించాడు. మధురమైన పెళ్ళి క్షణాలను తల్చుకుంటూ తీయని తలపులతో ఇల్లు చేరింది సరోజ. శేఖర్ రాసే జాబుకోసం అనుక్షణం ఎదురుచూస్తూ గడిపింది. ఇట్టే నెల రోజులు గడిచాయి. శేఖర్ వద్ద నుండి ఎటువంటి జాబూరాలేదు. సరోజకు ఆతృతతో పాటు కంగారెక్కువైంది. సరోజ తో డిదే లోకమని ఆమెకెన్నో బాసలు చేసిన శేఖర్ ఇల్లు చేరుకోగానే తల్లీ తండ్రి ఓ మంచి సంబంధం చూశామని, నీవు వచ్చి పిల్లను చూడ్డమే తరువాయి ముహూర్తం పెట్టుకోవచ్చని తొందర చేశారు.

శేఖర్ తండ్రికి ఎదురు చెప్ప లేక పెళ్ళి చూపులకు వెళ్ళి పిల్ల తనకు నచ్చలేదని చెప్తూ, సరోజ సంగతి కూడా చెప్పవచ్చునని తలచి పెళ్ళి చూపులకు వెళ్ళాడు. కాని పెళ్ళి చూపుల్లో శ్యామలను చూసి ఆమె వెనక వున్న ఆస్తిపాస్తుల్ని అంచనా వేసుకునే సరికి అతని నిర్ణయం పటాపంచలయి పోయింది. శ్యామల తల్లి తండ్రులకు ఒక్కతే కూతురు. శ్యామల పెద్ద తల్లికి సంతానం కలగకుండానే భర్త మరణించాడు. అతని ఆస్తి

**స్త్రీ!**

ఆ వర్ణంలోని మెలికలు<br>
ఆమె బ్రతుకులోని మలుపులు!

ఆ క్రావడి<br>
ఆమె చల్లనిబడి!

ఆ తావత్తు<br>
ఆమె లాలనల తాయెత్తు!

ఆ దీర్ఘగుడి<br>
శిరసెత్తుకొనగలిగే<br>
ఆమె నడవడికి ఒరవడి!<br>
ఆమె అక్షరాల బడి!

-"విశాఖ"

అక్షరాల బడి!

# మమకారం

నాలుగెకరాల మాగాణి పొలం, చిన్న డాబా ఇల్లు ఆమెకే సంక్రమించాయి. ఆవిడ గవర్నమెంటు హాస్పిటల్లో నర్సుగా ఉద్యోగం చేస్తూ శ్యామలనే ఆలంబనం చేసుకుని బ్రతుకుతుంది. శ్యామల తండ్రి కూడా కాస్తో కూస్తో కలిగినవాడే. మొత్తం ఆస్తి లక్ష పైనే ముట్టేటట్లువుంది. అందచందాలతో స్కూల్ ఫైనల్ పాసైన శ్యామల అతనికళ్ళకు అన్ని విధాలా నచ్చింది. మనసు మాత్రం సరోజ, సరోజ అని ఘోషిస్తుంటే నీకు తెలియదు. నువ్వూరుకో అనిగట్టిగా నోరు మూయించాడు. తిరిగొచ్చాక తీరిగ్గా కూర్చుని సరోజకు లెటరు రాశాడు.

డియర్ సరోజా!

మనిద్దరం కన్న కలలన్నీ కల్లలు చేస్తూ మానాన్న నాకు పెళ్ళి నిశ్చయం చేశాడు. అనుకోని పరిస్థితులు ఎదురవటంతో తప్పని సరై నేను తల వంచక తప్పలేదు. నాకు తెలుసు నువ్వు ఈ షాక్ తట్టుకోలేవని. కాని నా జీవితం నా చేతిలో లేదని తెలిశాక ఏమీ చెయ్యలేని అశక్తుడ్నయ్యాను. నిన్ను మర్చిపోలేక, పెద్దలను ఎదిరించలేక అడకత్తెరలో పోకలా నలిగి పోతున్నాను నిన్ను తల్చుకునే అర్హతను కూడ పోగొట్టుకున్నా. నేను జీవచ్ఛవంలా మిగిలాను. నన్ను మరిచిపొమ్మని వేడుకుంటూ నీ అని చెప్పుకోలేని....

శేఖర్

అని రాసి పోస్టు చేసి తన బాధ్యత తీరిందను కున్నాడు.

తరువాత శ్యామలను వివాహం చేసుకొని మామగారు ఇప్పించిన బ్యాంకు ఉద్యోగం చేస్తూ లక్షాధికారియై ఎలాంటి చీకూ, చింతా లేకుండా కాలం గడిపేస్తున్నాడు. శ్యామల తన ప్రేమానురాగాలతో అతని మనసును రంజింప చెయ్యటంతో సరోజను త్వరగానే మర్చిపో గలిగాడు. ఎప్పుడైనా అంతరంగాన మెదిలినా మళ్ళీ వెంటనే మరిచి పోయేవాడు.

శ్యామలకు తొలుచూలు కాన్పులో ఆడపిల్ల పుట్టినప్పుడు "ఏమండీ నేను ఏనాడూ ఎవరికీ అన్యాయం చేసికాని, అబద్ధం ఆడికాని ఎరుగను. ఎందుకనో భగవంతుడు నాకు ఆడపిల్ల నిచ్చాడు" అని బాధ పడింది.

రెండో సారి ఆడపిల్ల పుట్టినప్పుడు "ఏమండీ నా కడుపులో కపటం కుచ్చితం లేదు. అవేమైనా వుంటే మీలో నే వుండాలి. అందుకే ఈసారి కూడ "ఆడపిల్ల పుట్టింది" అంది. మూడో సారి పాప పుట్టినప్పుడు "ఏమండి మీరు ఏ జన్మలో ఏ అమ్మకో అన్యాయం చేసి వుంటారు. ఆడదాని వుసురు తగలబట్టే ఈ జన్మకు మనకంతా ఆడమేళం తయారైంది" అంది అయిష్టంగా పాపవంక చూస్తూ.

శ్యామల మాటల్ని అంతగా పట్టించుకోక పోయినా అతనికీ కొడుకు పుట్టనందుకు మనసులో బాధగానే వుంది. పాప పెరుగుతున్న కొద్దీ అందచందాలతో ఆటపాటలతో అలరారు తుంటే ప్రతి కంటికీ ముద్దొస్తుంటే ఆడపిల్ల అయితేనేమి? అన్న గర్వం, సంతోషం కలిగేది.

బ్యాంక్ టెస్టులన్నీ పాసై ఎకౌంటెంటుగా ప్రమోషనొచ్చి బదిలీ మీద ఈ వూరొస్తుంటే పనిమనిషికి కవల

పిల్లలు కలిగారని పూట గడవడం కష్టంగా వున్న ఆ తల్లి ఇద్దర్నీ పెంచలేక పోతోందనీ, పిల్లలు మాత్రం తెల్లగా రత్నాల్లా వున్నారని ఎవరికీ తెలియకుండా ఓ పిల్లవాడ్ని తీసుకెళ్లి మనం పెంచుకుందామండీ మొగ పిల్లవాడు లేని లోటు తీరుతుంది" అంది శ్యామల.

శ్యామలకు వంశం నిలబడటం కోసం మొగపిల్లవాడు కావాలని ఎంత కోరికగా వుందో తెలిసినా పని వాళ్ల పిల్లవాడ్ని పెంచుకోవటం ఏమిటని తనే వద్దన్నాడు. సరోజ కొడుకుని చూస్తే తనలో ఏదో తెలియని మమకారం బయలుదేరింది. రంగూ రూపూ అంతా తననే పోలి వున్నాడు. ఆ బాబు అచ్చం తన బాబేనని అంతరాత్మ పదే పదే చెప్తుంటే మంచంమీద నిలవలేక పోయాడు. ఎప్పుడెప్పుడు సరోజతో మాట్లాడాలా అని మనసు ఆతృత పడుతోంది. అనుకోకుండానే లేచి వెళ్లి శ్యామల పర్సు తెరిచి బట్టల బిల్లులో షాపు పేరు చదివి గుర్తు పెట్టుకున్నాడు.

ఉదయం లేచి పనులన్నీ ముగించుకుని రోజూకంటే ముందుగా బయలుదేరి బట్టల షాపు కెళ్లాడు. షాపు అప్పుడే తెరిచినట్టున్నారు. జనం పెద్దగా లేరు. వున్న ఒకరిద్దరికీ సరోజ బట్టలు చూపిస్తోంది. శేఖర్ని చూస్తూనే ముఖం దించుకుంది. బేరం చేస్తున్న మనిషి ప్రక్కన నిలబడి అతను చూసే బట్టల్నే తనూ చేతిలోకి తీసుకుని చూస్తున్నాడు. అతను వెళ్లగానే ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలియక తికమక పడుతూ సరోజ ముఖంలోకి చూశాడు... ఏం కావాలో చెప్పండి చూపిస్తాను" అంది సరోజ.

"నేను బట్టలకోసం రాలేదు. నీతో మాట్లాడుదామని వచ్చాను" అన్నాడు శేఖర్. "ఏం మాట్లాడుతారు?" కళ్లు పైకెత్తి అతని వంక చూస్తూ అంది సరోజ. "ముందు నన్ను క్షమించానని చెప్పు సరోజా! తరువాత మాట్లాడుతాను" అన్నాడు శేఖర్. క్షమించటానికి నేనెవర్ని? అంది.

"ఒకప్పటి నా ప్రేయసివి గనుక" అన్నాడు. "అదెప్పుడో మర్చి పోయాను" అంది. నీ బాబును చూస్తే నాలో ఏదో మమత పుట్టుకొస్తోంది. బాబు ఎవరో చెప్పవా సరోజా" అన్నాడు దీనంగా.

"ఎవరని చెబితే నువ్వు నమ్ముతావు?" రెట్టించింది. "నువ్వు చెప్పింది తప్పక నమ్ముతాను చెప్పు సరోజా చెప్పు" అని తొందర చేశాడు. "బాబు నీ బాబే" అంది సరోజ. మరి నువ్వు పెళ్లి చేసుకోలేదా?" లేదు. "ఎందుకని?" అతని ప్రశ్న. మనసారా ప్రేమించిన ప్రియుడే నిలువునా మోసం చేస్తే మరో మొగాడు నన్ను పెళ్లాడ గలడా? ఆమె సూటిగా వేసిన ప్రశ్నకు అతను చలించి పోయాడు. దోషిలా తలవంచి "సరోజా సాయంత్రం తీరిగ్గా మాట్లాడుకుందాం. అలా పార్కుకు వస్తావా?" అన్నాడు. ఇంకా మాట్లాడే దేమున్నదని? భారంగా నిట్టూర్చుతూ అంది సరోజ. "వుంది సరోజా వుంది. నువ్వు రావాలి" అన్నాడు. "నేను పరువుగా బ్రతుకుతున్న ఆడదాన్ని రాలేను. నా జాతకం ఇంతేనని సరిపెట్టుకొన్నాను. శ్యామల అమాయకురాలు. ఆమె కన్యాయం చెయ్యవద్దని వేడుకుంటున్నాను. అందుకని ఇంకెప్పుడూ నాతో మాట్లాడటానికి ప్రయత్నించకండి. వెళ్లండి. మీకు టైమవుతోంది వెళ్లం"డంది ముఖం దించుకుని క్రిందికి చూస్తూ.

ఇంతలో ఎవరో బట్టల కొరకు రాగా, గబగబ వాళ్లడిగినవి తీసి చూపించ సాగింది. అతను వెళ్లేందుకు ఉద్యుక్తుడవుతుండగా "ఇంకెప్పుడూ నాతో మాట్లాడాలని ప్రయత్నించకండి" అని అతనికి మాత్రమే వినిపించేట్టు అంది. అది విన్న అతడు వెళ్లి పోయాడు. ఆ రోజంతా ఆలోచించి అతనో నిర్ణయానికి వచ్చాడు. మర్నాడు ఉదయం స్నేహితుడు చంద్రాన్ని కలిసి జరిగిందంతా వివరించి తన నిర్ణయం కూడా తెలిపాడు.

అంతా విన్న చంద్రం "ఒరే శేఖర్ నువ్వు తొందరపడి ఈ నిర్ణయం తీసుకున్నావని పిస్తోంది. శ్యామలకుతెలిస్తే ఒప్పుకుంటుం దంటావా? ఒప్పుకోకపోతే అనేక చిక్కుల్లో పడటం అవుతోంది. అందుకని ముందుగా శ్యామలకు చెప్పి ఆమె అనుమతి తీసుకో. అప్పుడు నేను వెళ్లి సరోజతో మాట్లాడి ఒప్పిస్తాను." అన్నాడు.

"లేదురా చంద్రం శ్యామల అందరిలాంటి ఆడది కాదు. ఆమెలో ఈర్ష్య, అసూయ అన్నది లేని విశాల హృదయం వుంది. ఆ హృదయంలో నా తరువాత వంశం నిలబడటం కోసం వంశోద్ధారకుడు కావాలన్న బలమైన కోరిక వుంది. ఆమెకున్న పుత్రప్రేమలో పని మనిషి కొడుకైనా ఫరవా లేదనుకున్న దంటే సరోజ విషయం తెలిస్తే తప్పక అంగీకరిస్తుందన్న నమ్మకం నాకుందిరా. ఆ నమ్మకంతోనే నేనీ నిర్ణయం తీసుకున్నాను. సరోజకు నా వల్ల జరిగిన అన్యాయానికి నా అంతరాత్మ ఎదురు తిరగటంతో నేను మనశ్శాంతిని కోల్పోయాను. సరోజకు జరిగిన

---



## పరమ్‌వీర్ చక్రలో కన్వల్జిత్

టి.వి. మహాభారత్ సీరియల్ పూర్తి అయిన వెంటనే ఆదివారం పూట అదే సమయంలో ప్రారంభమైన 'పరమ్ వీర్ చక్ర'లో కన్వల్జిత్‌సింగ్‌కు మంచి పాత్ర లభించింది. 'జీవన్ ఏక్ సంఘర్ష్', 'అంబా' సీరియల్స్ కన్వల్జిత్‌కు అంత గుర్తింపు తీసుకు రాలేకపోయాయి. ఈ పరమ్ వీర్ చక్ర తనకు మంచి గుర్తింపును తీసుకు రాగలదన్న ఆకాంక్షతో వున్నాడట కన్వల్జిత్

# పిల్లల సంరక్షణ కొన్ని సూచనలు

పుట్టిన తర్వాత మొదటి కొద్ది మాసాలలో తను పొందే సంరక్షణను బట్టి ఒక శిశువు ఆ తర్వాత కాలంలో చదువు సంధ్యల్లోగాని, సామాజికంగా గాని అభివృద్ధి చెందడమనేది ఆధారపడి వుంటుందని ఇటీవల శాస్త్రీయ ఆధారాలతో సహా రుజువైనట్టు అమెరికాలో బాలల సంరక్షణకు సంబంధించిన నిపుణుల సంఘం ఒకటి పేర్కొన్నది.

ఉద్యోగాలలో వున్న వారి పిల్లలకు సంబంధించిన సంరక్షణా విషయాల మెరుగుదలకై అమెరికాలో జాతీయ ప్రమాణాలను నిర్దేశించాలని అమెరికా జాతీయ పరిశోధనా మండలికి చెందిన 19 మంది సభ్యుల సంఘం అభిప్రాయపడింది. బిడ్డ పుట్టిన తర్వాత, లేదా బిడ్డను దత్తత తీసుకున్న తర్వాత ఆ బిడ్డ తల్లిదండ్రులు అవసరమైతే ఏడాదికాలం వరకు (జీతం లేని, ఉద్యోగం కొనసాగింపు జరిగే) సెలవు పొందే సౌకర్యాన్ని అయా తల్లిదండ్రులకు కల్పించి తీరవలసిందిగా వారు పనిచేసే సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలని కూడా నిపుణుల సంఘం సూచించింది.

అన్ని కుటుంబాలకు ప్రత్యేకించి తక్కువ ఆదాయం గల కుటుంబాలకు ఉపయోగపడే విధంగా వుండే మరింత సమర్థమైన బాలల సంరక్షణా వ్యవస్థపై ఏటా 5వేల మిలియన్ డాలర్ల నుంచి 10 వేల మిలియన్ డాలర్ల మేరకు అదనంగా ఖర్చు చేయాలని కూడా ఈ సంఘం అమెరికా కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలను కోరింది. అమెరికాలో ఇప్పుడు వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలు, తల్లిదండ్రులు బాలల సంరక్షణపై ఏటా 16 వేల మిలియన్ డాలర్ల మేరకు ఖర్చు పెట్టడం జరుగుతున్నది.

ఇలా వుండగా 2000 సంవత్సరం నాటికి అమెరికాలో పాఠశాలకు వెళ్లే వయసులో వున్న బాలలలో 80 శాతం మంది, ఇంకా బడికి వెళ్లే వయసుకు చేరని పిల్లలలో 70 శాతం మంది ఉద్యోగాలు చేసే తల్లులను కలిగి వుంటారని ఇటీవల పరిశీనలో వెల్లడైంది.

కాగా, బాలలలో ఆరోగ్యకరమైన రీతిలో శారీరక, మానసిక పెరుగుదల జరగాలంటే వారి సంరక్షణకు తీసుకునే చర్యలు ఉత్తమస్థాయిలో వుండాలని పరిశోధనా మండలి సంఘం పేర్కొన్నది. బాల్యంలో ఎంత చక్కని సంరక్షణ పొందగలిగితే ఆ బాలలు తదుపరి జీవితంలో అంత చక్కటి విజయాలను సాధించగలుగుతారని జాన్‌హాప్కిన్స్ యూనివర్సిటీ సోషియాలజీ ప్రొఫెసర్ ఆండ్రూ చెర్లిన్ అన్నారు.

అయితే.....బాల్యంలో తల్లిదండ్రుల సంరక్షణ తక్కువగా వున్న పిల్లలకు కోపిష్టి మనస్తత్వం, పెద్దల మాట సరిగా వినని గుణం, భాషా నైపుణ్యంలో వెనుకబాటుతనం ఏర్పడతాయని పరిశోధనా మండలి సంఘం అధ్యక్షుడైన సిరాక్యూస్ యూనివర్సిటీ మాక్స్‌వెల్ స్కూల్ జాన్‌పామెర్ చెప్పారు.

బాలల సంరక్షణకు సంబంధించి సర్వీసులకు చెల్లింపులు జరిపే విషయంలో తక్కువ ఆదాయం గల కుటుంబాలకు 'సబ్సిడీ' సదుపాయాలు కల్పించవలసిందిగా కూడా సంఘం అమెరికా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది.

( యు ఎస్ ఐ ఎస్)

## మమకారం

అన్యాయాన్ని పూరించిన నాడే నా మనసుకు సంపూర్ణమైన మనశ్శాంతి లభించేది. అందుకనే నేనీ నిర్ణయం తీసుకున్నాను. ఎలాగైనా సరోజను ఒప్పించే భారం నీదేరా అని చంద్రం రెండు చేతులూ పట్టుకున్నాడు శేఖర్.

"నా సాయశక్తులా ప్రయత్నిస్తాను. ఆ తరువాత నీ అదృష్టం ఎలా వుంటే అలా జరుగుతుందని చెప్పి వెళ్లిపోయాడు చంద్రం.

* * * * * * * * *

సరోజ షాపులో పని ముగించుకుని ఏడింటికి ఇల్లు చేరింది. ఇంట్లో రవిని ఒళ్లో కూర్చోపెట్టుకుని కబుర్లు చెప్తున్న చంద్రాన్ని చూసి ముందు ఆశ్చర్యపోయినా తరువాత శేఖర్ పంపించి వుంటాడని వూహించింది. "ఏమిటన్నయ్యా ఎన్నడూ లేనిది ఇలా వచ్చారు?" అని నవ్వుతూ పలకరించింది. "ఓ ముఖ్యమైన విషయం నీతో మాట్లాడుదామని వచ్చానమ్మా" అన్నాడు చంద్రం. "ముందు కాఫీ తెస్తాను. తరువాత మాట్లాడుదురు గాని" అని గబగబ లోపలి కెళ్లి స్టౌ అంటించి కాఫీ పెట్టి కప్పులో పోసి తెచ్చి అతని కిచ్చింది. అతను కాఫీ తాగాక చూడమ్మా సరోజా! శేఖర్ తన వలన నీకు జరిగిన అన్యాయాన్ని గురించి అంతా నాకు చెప్పాడు. నువ్వు అతనితో మాట్లాడడానికి అవకాశం ఇవ్వక ఇంకెప్పుడూ నీతో మాట్లాడవద్దని గట్టిగా చెప్పావుట. అందుకే నన్ను పంపించాడు. నీకు చేసిన అన్యాయానికి చాలా పశ్చాత్తాప పడుతున్నాడు. నీవు అంగీకరిస్తే దేవుడి గుళ్లో నా సమక్షంలో నిన్ను దండల పెళ్లి చేసుకుని అతని భార్యా, బిడ్డగా మీకు అర్హత కలిగిస్తా నంటున్నాడు. నాకు కూడా అది సబబుగానే తోచింది. భర్త అనేవాడు లేక ఒంటరిగా ఎంత కాలం జీవించ గలవు? ఈ సమాజంలో అలా బ్రతకటం అడుగడుగునా కష్టాలను ఎదుర్కోవాల్సి వుంటుంది. అందుకని గతం అనేది మర్చిపోయి శేఖర్ భార్యగా ముందు జీవితాన్ని గడపమని నేను కూడ సలహా ఇస్తున్నాను. నా మాట కాదనక బాగా ఆలోచించి నీవో నిర్ణయానికి రామ్మా" అన్నాడు చంద్రం.

అంతా విన్న సరోజ భారంగా నిట్టూర్చి "అన్నయ్యా! ఈ రాత్రంతా ఆలోచించి రేపు ఉదయం నా నిర్ణయాన్ని తెలియజేస్తాను" అంది. అలాగేనమ్మా... అలాగే అని చెప్పి వెళ్లి పోయాడు.

అతని కోసం దారిలో ఎదురు చూస్తున్న శేఖర్‌కు అదే విషయం చెప్పాడు. ఇరువురూ ఏమీ మాట్లాడుకోలేదు. ఎవరు దారిన వాళ్లు వెళ్లి పోయారు. ఆ రాత్రి శేఖర్‌కు నిద్ర పట్టలేదు. ఎప్పుడు తెల్లవారు తుందా? ఎప్పుడు సరోజ నిర్ణయం

తెలుపుతుందా? అని క్షణ మొక యుగంలా గడిపాడు. ఉదయమే లేచి ముఖం కడుక్కొని కాఫీ త్రాగి స్నానం కూడ చెయ్యకుండా నైట్ డ్రస్సులోనే చంద్రాన్ని వెంట తీసుకుని సరోజ ఇంటికి వెళ్ళి తను బయట నిలబడి చంద్రాన్ని లోపలికి వెళ్ళమన్నాడు.

దగ్గరకు వేసివున్న తలుపు తీసుకుని చంద్రం లోపలికి వెళ్ళాడు. సరోజ, రవీ ఇంకా నిద్ర లేవలేదు. పడుకునే వున్నారు. టైం ఏడవుతుంది. లేపాలా, వద్దా అనుకుంటూనే "సరోజా సరోజా" అని రెండుసార్లు పిలిచాడు. ఆ పిలుపుకు రవి బద్ధకంగా కళ్ళు తెరిచి ఎదురుగా వున్న చంద్రాన్ని చూసి ఆశ్చర్యంతో "మమ్మీ-మమ్మీ అంకుల్ వచ్చారు" అని తల్లిని తట్టి లేపాడు. సరోజలో చలనం లేదు. "అంకుల్ మమ్మీ చల్లగా వుంది" అన్న రవి మాట విని చంద్రం ఆత్రుతగా సరోజ నుదుటి మీద చెయ్యివేసి చూసి కంగారుగా "ఒరే శేఖర్" అని గట్టిగా అరిచాడు. ఆత్రుతగా లోపలి కెళ్ళిన శేఖర్ "సరోజ తన నిర్ణయం చెప్పాల్సొస్తుందని మనం రాకముందే వెళ్ళి పోయిందిరా" అన్న చంద్రం మాట విని నిశ్చేష్టుడై అలాగే నిలబడి పోయాడు.

"అంకుల్ అమ్మ తల క్రింద ఈ కాగితం వుంది" అని తీసి ఇచ్చాడు రవి. శేఖర్ ఆత్రుతగా కాగితంలోకి చూశాడు.

డియర్ శేఖర్!

తెలిసీ, తెలియని వయసులో నా మనసులో ప్రేమను చిగురింప జేసి ఓ రంగుల లోకాన్ని చూపించావు నాకు. లోకమంతా అలా రంగుల్లో సుందరంగా వుంటుందని భ్రమించిన నాకు నీవు పెళ్ళి నిశ్చయం చేసుకుని నన్ను మర్చిపొమ్మని రాసిన లెటర్ చూసుకున్నాక నా భ్రమలన్నీ తొలగిపోగా తల్లిని కాబోతున్నట్టు తెలుసుకున్నాను. వదిన వెంటనే పసిగట్టేసింది. అన్నయ్యతో గొడవ పెట్టుకుని ఇంట్లో పెద్ద రాద్ధాంతం లేవదీసింది. అన్నయ్య ఏమీ చెయ్యలేని నిస్సహాయుడై వూరుకున్నాడు. వదిన తన పరువు బజారున పడకముందే నన్ను ఇంట్లోనుండి వెళ్ళి పొమ్మంది. దిక్కులేని అనాధనై బయట కొచ్చాను. ఎటు పోవాలో దిక్కు తోచలేదు. హాస్టల్‌కు చేరుకుని నేనంటే అభిమానంగా వుండే వార్డెన్‌కు అంతా వివరించాను. ఆవిడ నా మీద జాలి తలచి ఆశ్రయం ఇచ్చింది. నా కడుపులో వున్న భారాన్ని పోగొట్టుకోవాలని చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కాగా తప్పనిసరై వార్డెన్‌గారే నాకు పురుడు పోశారు. సూర్యోదయాన పుట్టాడని "రవి" అని నామకరణం చేసింది. ఆ చిన్నారి పసికందును చూసుకోగానే నాలో బ్రతుకు మీద ఆశ చిగురించింది. చిన్న ఉద్యోగాలు చేస్తూ నా రవితోడిదే లోకమని ఆశలన్నీ వాడిమీదే పెట్టుకుని బ్రతుకుతున్న నాకు ఈ సమాజంలో వంటరి ఆడది ఎన్ని బాధలు, అవమానాలను ఎదుర్కోవాలో అన్నీ ఎదుర్కొన్నాను. కాని ఒకానొక దుర్ఘడియలో ఒక రాక్షసుడి చేతిలో నా శీలాన్ని పోగొట్టు కున్నాను. ఆనాడే నేను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. కన్న పాశంతో రవి మీద వుండే మమకారం నన్ను చావనియ్య లేదు. ఆ వూరొదలి ఈ వూళ్లో బట్టల షాపులో చేరాను. ఆరేళ్ళ నుండి ఇక్కడే వుంటున్నాను. మా ఓనరుగారు నన్ను కన్న బిడ్డలా ఆదరించారు. నీ ఇల్లు అని తెలియక నీ పాప పుట్టిన రోజుకు నీ ఇంటికి రావడం, నిన్ను చూడటం జరిగింది. నాలో క్షణం ఈర్ష్య కలిగినా శ్యామలను చూశాక నన్ను చేసుకున్న దానికంటే శ్యామలను చేసుకోవటం వల్లనే నువ్వెంతో సుఖంగా జీవిస్తున్నావని ఆనందించాను. అనుకోకుండా నువ్వు షాపులో నాతో మాట్లాడాలని వచ్చినప్పుడు పచ్చని నీ సంసారంలో కలతలు లేపడం ఇష్టంలేక నేనే ఈ వూరిడిచి వెళ్ళిపోవాలనుకున్నాను. చంద్రం అన్నయ్య వచ్చి నీ అభిప్రాయాన్ని నాకు చెప్పి నా నిర్ణయాన్ని తెలియజేయ మన్నప్పుడు శ్యామల నా రవిని కన్నబిడ్డలా ఆదరించ గలదన్న నమ్మకంతో ఇది సరైన నిర్ణయమేనని ఇలా వెళ్ళిపో తున్నాను కడసారి వీడ్కోలుతో...

– సరోజ

చదవడం ముగించిన శేఖర్ కాగితాన్ని చంద్రం చేతిలో వుంచి, "నేనీ వూరు వచ్చి సరోజ చావుకు కారకుడ్నయ్యాను. నా చేజేతులా సరోజకు అన్యాయం చేసినందుకు జన్మాంతం మనశ్శాంతిని పోగొట్టుకుని కుమిలిపోక తప్పదంటూ, "మమ్మీ మమ్మీ" అని అంటూ హృదయ విదారకంగా విలపిస్తున్న రవిని పితృ వాత్సల్యంతో ప్రేమతో దగ్గరకు తీసుకొని హృదయానికి హత్తుకున్నాడు.

○

